జ్యోతి - సెప్టెంబర్, 1985

"ఆదివారం ఉద్యోగస్థులకెంతో మధురం.
టీవీలు వచ్చేక ఆ మాధుర్యం కాస్త తగ్గింది-"

# ముద్దు బిడ్డలు

శనివారం రాత్రి ఇంటికి ఆలస్యంగా వచ్చాను. "డాడీ - రేపు సినిమా సంజోతా" అన్నాడు పెద్దకొడుకు. "ఎలా ఉంటుంది డాడీ - బాగుంటుందా?" అన్నాడు రెండోవాడు.

నాకిద్దరు ముద్దుబిడ్డలు. వాళ్ళేం మాట్లాడినా ఏమడిగినా ఎంతో ముద్దు వస్తుంది. నాతో కలిసి సినిమా చూడ్డం వాళ్ళకెంతో యిష్టం.

"సంజోతాయా-సరిగ్గా వారం రోజుల క్రితమే ఆఫీసులో చూపించారుగా" అన్నాను.

మా ఆఫీసులో అప్పుడప్పుడు సినిమాలు చూపిస్తూంటారు. టికెట్టు పెద్దలకు రూపాయ. పిన్నలకు అర్థరూపాయ. అంతచవగ్గా సినిమా వస్తూంటే ఏదైనా సరే వదలకూడదని పట్టుదలగా వేసిన ప్రతి సినిమా చూస్తూంటాం మేము. ఇందుకు శ్రీమతి వ్యతిరేకం. కానీ మెజారిటీకి తల వంచక తప్పదు.

"ఓహ్ డాడీ! అదా - సరైన ఫైటింగే ఉండదు..." అన్నాడు పెద్దకొడుకు.

"అలాంటి సినిమా టీవీలో చూడాలంటే యింకా బోరు..." అన్నాడు రెండోవాడు.

వీళ్ళ మాటలు విని వీళ్ళే కాలేజీలోనో చదువుతున్నారనుకునేరు. మా పెద్దవాడికి అయిదున్నర. రెండోవాడికి నాలుగుంపావు. ఇద్దరికీ వయసును మించిన కబుర్లు. బొద్దుగా, ముద్దుగా పెద్దాఫీసరు పిల్లల్లా ఉంటారు. అన్నట్లు నా భార్య కూడా పెద్దాఫీసరు భార్యలాగే ఉంటుంది. మా ఇంట్లో నేనే పెద్దాఫీసర్లా ఉండను. కానీ నిజానికి నేను పెద్దాఫీసర్నే!

శ్రీమతిని పిలిచి, "చూసిన సినిమా మళ్ళీ ఏం చూస్తాం! ఎక్కడికైనా ప్రోగ్రాం చెప్పు..." అన్నాను.

శ్రీమతి తడుముకోకుండా, "శారదగారింటికి వెడదాం-" అనేసింది.

"అంటే సత్యానందంగారింటికా?" అన్నాను.

"జోకర్, వాకర్ల ఇంటికేనా?" అన్నాడు నా పెద్దకొడుకు. ఆ వెనువెంటనే అదేమాట నా చిన్నకొడుకు అన్నాడు.

శారద, సత్యానందం, జోకర్, వాకర్ కలిస్తే అదో కుటుంబం. వాళ్ళు మాకు మంచి స్నేహితులు. అందుకు కారణం మా ముద్దుబిడ్డలే!

మా పిల్లలెంతో బుద్ధిమంతులని వాళ్ళు మెచ్చుకుంటారు. వాళ్ళ పిల్లల అల్లరికి

మేము ముచ్చటపడతాం. వాళ్ళ మెప్పుకోలు మా కిష్టం. మా ముచ్చట వాళ్ళ కిష్టం.

అందుకని వీలున్నప్పుడల్లా వాళ్లు మా యింటికొస్తారు. మేము వాళ్లింటికి వెడతాం.

ఈ టీవీలొచ్చాక ఆదివారాలు, శనివారాలు ఎక్కడికి వెళ్ళడానికి లేకుండా ఉంది. అందుకే అప్పుడప్పుడిలాంటి రిపీట్ ప్రోగ్రామ్స్ రావడం మంచిదనిపించింది.

వెంటనే ప్రోగ్రాం ఫైనలైజ్ చేసేయాలనుకున్నాం. మాకూ ఫోనుంది. సత్యానందానికి ఫోనుంది. నేను సత్యానందానికి ఫోన్ చేసాను.

సత్యానందం కూడా మాతోపాటు సంజోతా సినిమా చూసి ఉన్నాడు. అందుకని ఎంతో సంతోషంగా– "చాలామంచి ప్రోగ్రాం! బయట చూసినా టీవీలో మళ్ళీ చూస్తానంటారేమోనని భయపడ్డాను. కానీ - నాకే మీ యింటికి ఫోను చెయ్యాలని పించింది" అన్నాడతడు.

ఆ రాత్రి మర్నాటి ప్రోగ్రాం గురించి కలలుకంటూ నిద్రపోయాం. తెల్లారింది.

ఉద్యోగస్థులకెంతో మధురమైన ఆదివారమది, ఆ మాధుర్యం కొంత తగ్గిందీ టీవీలు వచ్చేక! అంతకు ముందైతే తాపీగా కబుర్లు చెప్పుకుంటూ ఒకరికొకరు సాయం చేసుకుంటూ ఆడుతూ పాడుతూ వంటచేసుకుని తినేవాళ్ళం. ఇప్పుడలా కాదు. తొమ్మిదిన్నరయ్యేసరికి అన్ని పనులూ వంటతో సహా అయిపోవాలి. అందులోనూ ఆదివారమంటే ఆరోజే చాకలి బట్టలకు వస్తాడు. సినిమా ఏమిటని అడగడాని కిరుగు పొరుగులు వస్తారు. పనిమనిషి నాగాపెడుతుంది. నన్నో, పిల్లల్నో క్షౌరం చేయించుకోమని బలవంతపెట్టడానికి మంగలి వస్తాడు. టీకి డబ్బులు లంచంగా యిస్తే తప్ప బాత్రూం కడిగి పాడుచేస్తానని బెదిరించే మునిసిపాలిటీ పాకీ మనిషి వస్తుంది.

తొమ్మిదిన్నరకు టీవీ దగ్గర కూర్చుంటే అక్కడే భోజనాలు. అక్కడే అన్నీను. ఆ లేవడం మళ్ళీ ఒంటిగంటదాటేకనే! అదైనా మధ్యాహ్నం తెలుగు సినిమా వేయకపోతేనే - లేకుంటే రాత్రి తొమ్మిదయ్యేదాకా అంతే!

ఈ ఆదివారమల్లాకాదు. సాయంత్రం వేయబోయే హిందీసినిమా చూడక్కర్లేదను కునేసరికి రోజంతా ఖాళీయేననిపించింది. అందుకని ఉదయపు పనులు చాలావరకూ మధ్యాహ్నానికి వాయిదా వేసింది శ్రీమతి. అయితే ఆ రోజు ఉదయం పదింటినించి రెండింటిదాకా కరెంటు లేదు. అందువల్ల టీవీ చూడ్డం పడలేదు. అలాగని ఇంటిపనులూ అవలేదు.

వేణ్ణీళ్ళు కాచుకుందుకు కరెంటు కావాలిగదా! పచ్చడి రుబ్బుకుందుకు కరెంటు కావాలి గదా! ఉక్కబోయకుండా ఫాన్ తిరగాలంటే కరెంట్ కావాలి గదా!

కరెంటు లేకపోతే క్షణం గడవని రోజులివి. కరెంటుకు క్షణక్షణ గండమైన రోజులివి.

ఏమైతేనేం-సాయంత్రం ప్రోగ్రాం కోసం ఎదురుచూస్తూ టైం గడిపేశాం. మేమింతలా ఎదురుచూడ్డానికి కారణం - సోషల్ విజిట్స్ కొట్టి చాలాకాలం కావడమే!

ఎదురుచూసిన క్షణం వచ్చింది. స్కూటర్ మీద నాలుగున్నరకల్లా సత్యానందం గారింటికి వెళ్ళాం.

"వెంటనే వెళ్ళడానికి వీల్లేదు. చాలాకాలం తర్వాత వచ్చారు. ఈ రాత్రికి మా యింట్లోనే భోజనం..." అంది శారద.

ముందు కాస్త మొహమాటపడ్డా చివరకు అంగీకరించా.

పిల్లలు నలుగురూ ఆటల్లో పడిపోయారు.

మేము కబుర్లు మొదలు పెట్టాం.

కాసేపు శారద మా పిల్లల్ని మెచ్చుకుంది. బాకీ ఉంచుకోకుండా శ్రీమతి కూడా శారద పిల్లల్ని మెచ్చుకుంది.

"అన్నట్లు మావాళ్ళీమధ్య ప్రోగ్రాం ఒకటిచ్చారు..." అంది శారద.

"ఏమిటది!" అంది శ్రీమతి. నేనూ ఆమెతో జతకలిశాను.

జోకర్ ఏమో ఎన్టీరామారావుట. వాకర్ అతటి సెక్రటరీట. ఎడతెరిపిలేని షూటింగులతో ఉన్న రామారావు - ఒక రోజు కార్యక్రమాన్ని వాళ్ళు ప్రదర్శించారు. దాన్ని సత్యానందం తయారుచేశాడు. జోకర్ స్కూల్లో ప్రదర్శించారు. ప్రదర్శనకు ఒకటే చప్పట్లు!

"ఏదీ - ఇప్పుడు చెబుతారేమో చూద్దాం-" అన్నాను నేను.

"ఒరేయ్ జోకర్...." అంది శారద. అంతే పిల్లలు నలుగురూ వచ్చారు.

జోకర్ పేరదికాదు. బహుశా సత్యనారాయణ అనుకుంటాను. వాకర్ పేరు కూడా ఏ రామలింగరావో ఉండాలి. తల్లిదండ్రులు వాళ్ళను ముద్దుగా అలా పిల్చుకుని ఆనందిస్తారు. వాళ్ళిద్దరూ కూడా ఎన్టీఆర్ ఫాన్స్. ఇద్దరికీ వయసు ఏడాదికంటే తేడా ఉండదు. పెద్దవాడి వయసు ఎనిమిదికీ తొమ్మిదికీ మధ్య.

శారద పిలుపు వింటూనే పిల్లలు నలుగురూ వచ్చారు.

"ఎన్టీఆర్ షూటింగు యాక్టుచేసి చూపిస్తారా?" అంది శారద.

చూపడానికి వాళ్ళు, చూడ్డానికి మేము చాలా సరదాపడ్డాం.

షో ప్రారంభమైంది.

పండుగనాడు కూడా కాల్‌షీట్ తప్పదని రామారావు దిగులుపడడంతో ప్రారంభమవుతుంది షో! మూడు షూటింగులకు రామారావు ప్రిపేరవడం ప్రదర్శనాంశం. ఒకటి తల్లికానక ఆవేదనపడే తనయుడి పాత్ర. రెండవది కల్లుకొండయ్యలాంటి మారువేషం. మూడవది పౌరాణిక పాత్ర.

మూడింటినీ రామారావెలా నటిస్తాడో చక్కగా అనుసరించి చూపాడు జోకర్. అప్రయత్నంగా చప్పట్లు కొట్టాను నేను.

"స్క్రిప్టు కూడా బాగా తయారుచేశారు-" అని శ్రీమతి మెచ్చుకుంది.

"వాళ్ళు బాగా చేయడం వల్లనే స్క్రిప్టుకందం వచ్చిందని అంతా అంటున్నారు..." అంది శారద.

మేము దానిగురించి చర్చిస్తూండగా అక్కడికి జోగారావు కుటుంబం వచ్చింది. వాళ్ళూ సంజోతాకు భయపడి రోడ్లమీద తిరుగుతూ ఏ యింట్లో దూరదామా అని ప్రయత్నిస్తున్నారు.

"మేమిక్కడికి రావడంవల్ల మంచి కాలక్షేపమయింది" - అంటూ నేను జోకర్ అభినయం గురించి చెప్పాను.

"మరి మేమెప్పుడు చూస్తాం?" అన్నాడు జోగారావు వెంటనే.

మా పిల్లలు వెంటనే - "యిప్పుడే.... యిప్పుడే..." అన్నారు.

జోకర్ అందుకు సిద్ధంగానే ఉన్నాడు. వాడుత్సాహంగా ప్రదర్శన యిచ్చాడు. జోగారావు చప్పట్లుకొట్టి - "మార్వెలస్! మీవాడినీసారి ఎన్టీఆర్‌కు చూపించు" అన్నాడు.

శారద ఎంతో సంతోషించింది.

దానిగురించి మేమింకా చర్చిస్తూండగానే ఓ బ్రహ్మచారి వచ్చాడు. అతడు సత్యానందానికి జూనియర్ కొలీగుట. విషయం విని తనూ చూస్తానన్నాడు.

జోకర్ ఉత్సాహంగా ప్రదర్శన యిచ్చాడు.

ఈసారినాకది అంతగా నచ్చలేదు. వెంటవెంటనే చూడ్డంవల్లనేమో విసుగనిపించింది. కానీ పైకి చెప్పలేదు. బ్రహ్మచారి మాత్రం జోకర్ని తెగమెచ్చుకున్నాడు. మొదటిసారి చూసినవాళ్ళకలాగే ఉంటుంది మరి.

మర్యాదకు నేనూ బ్రహ్మచారితో ఆ విషయమై మాటలు కలిపాను.

మాటలు నడుస్తుండగా అక్కడికి చింతామణి వచ్చాడు. ఆయన సత్యానందానికి పొరుగున ఉంటున్నాడు. భార్యపుట్టింటికి వెళ్ళింది. టీవీ సినిమా బోర్‌కొట్టి యిలా వచ్చాడు. సత్యానందం యింట్లో పుస్తకాలేమైనా ఉన్నాయా అనడిగాడాయన.

"డాడీ - అంకుల్‌కి కూడా చూపించనా?" అన్నాడు జోకర్.

జోగారావు లేచి నిలబడి - "మేమిక ఉంటాం బ్రదర్!" అన్నాడు. అతడెందుకంత వెంటనే వెళ్ళిపోతున్నాడో నాకర్థమైంది.

శారదకు వంటపని ఉంది. అందుకని ఆమె జోగారావు వెళ్ళిపోవడానికి అభ్యంతరం చెప్పలేదు. వాళ్ళు వెళ్ళాక శారద, శ్రీమతి వంటింట్లోకి వెళ్ళారు.

నాకు, చింతామణికి, బ్రహ్మచారికి మరో ప్రోగ్రాం యిచ్చాడు జోకర్. ఈసారి చింతామణి బాగా సంతోషించాడు. సత్యానందం ఆయనకు అడిగిన పుస్తకాలిచ్చి పంపాడు.

ఇంకా మా కబుర్లు మొదలవకుండానే జగదీష్ ప్రసాద్ వచ్చాడు. అతడు నాకోసం మా యింటికి వెళ్ళి యిక్కడున్నాడని తెలిసి యిలా వచ్చాడు. రేపు ఆఫీసుకు రాడుట. లీవ్‌లెటరు నాకిచ్చి వెళ్ళిపోయాడు.

అతడికి వాళ్ళబ్బాయి ప్రోగ్రాం గురించి సత్యానందమే చెప్పాడు.

"జోకర్ అలసిపోయినట్లున్నాడు..." అన్నాను నేను.

"లేదు అంకుల్!" అన్నాడు జోకర్.

బ్రహ్మచారి వెంటనే లేచి సెలవు తీసుకున్నాడు. ఆ అదృష్టం నాకులేదు.

భోంచేసేలోగా ఈ ప్రదర్శన ఎన్నిసార్లు చూడాలో!

జోకర్ ప్రదర్శన యిస్తూంటే నేను మనసులో కసిగా – నా పిల్లలక్కూడా యిలాంటి ప్రోగ్రామొకటి నేర్పి ఓ పాతికసార్లు వరుసగా సత్యానందానికి చూపించాలనుకున్నాను.

జోకర్ ప్రదర్శన పూర్తి అయింది. జగదీష్‌ప్రసాద్ లేచి నిలబడి వాడినెత్తుకుని విపరీతంగా పొగిడేశాడు. జోకర్ ఉక్కిరిబిక్కిరైపోతుంటే – “రామారావు యాక్షనే బాగుందా – సెక్రటరీది బాగోలేదా?” అన్నాడు వాకర్ జాలిగా. అప్పుడు జగదీష్‌ప్రసాద్ వాడినీ ముద్దులాడాడు.

సత్యానందం ముఖంలో గర్వం స్పష్టంగా కనబడింది. అతడికి తనబిడ్డల కార్యక్రమం విసుగనిపిస్తున్నట్లు లేదు. ఎన్నిసార్లయినా తనూ ఉత్సాహంగా చూస్తున్నాడు. నేను మాత్రం ఆ కార్యక్రమం ముగిసీ ముగియగానే – “టీవీ ఆన్‌చేయకూడదూ – సినిమా చివరిదృశ్యం చూడొచ్చు. అది చాలా ఫన్నీగా ఉంటుంది....” అన్నాను.

కేవలం జోకర్ కార్యక్రమం నుంచి తప్పించుకోవడం కోసమలా అన్నాను. కానీ – సంజోతా చివరిదృశ్యం చూడాలని నాకు కోరిక లేదు. జోకర్ కార్యక్రమమైనా ఒకసారి చూస్తే బాగానే ఉండేది. వరుసగా వెంటవెంటనే చూడ్డంవల్ల అలా అనిపించింది.

సత్యానందం టీవీ ఆన్ చేశాడు. అందులో ఏం వస్తోందో నాకు తెలియదు కానీ – కాసేపు ఆ స్క్రీన్ మీద కూడా జోకర్ యిచ్చిన కార్యక్రమమే కనబడింది. అప్పటికే టీవీవాళ్ళక్కూడా ఈ ప్రోగ్రాం చేరిందా అనుకున్నాగానీ – అది నా ఆప్టికల్ ఇల్యూజన్ అని తెలుసుకునేందుకెంతోసేపు పట్టలేదు.

నా అదృష్టం కొద్దీ జగదీష్‌ప్రసాద్ వెళ్ళేక యింకెవ్వరూ రాలేదు.

కొద్దిక్షణాల్లో సినిమా అయిపోయింది. అప్పుడు నా మూడెలా ఉందంటే – టీవీలో ఏ డాక్యుమెంటరీ వేసినాసరే – శ్రద్ధగా చూసేయాలని!

టీవీలో అనౌన్సర్ కనబడింది. అందంగా నవ్వింది.

“ఇప్పుడొక ప్రత్యేక కార్యక్రమం. మొన్నరాత్రి మన ప్రధాని శ్రీ రాజీవ్‌గాంధీ అమెరికన్ పత్రికా విలేఖరులతో జరిపిన గోష్టి లైవ్ టెలికాస్ట్ మీరంతా చూసి ఉన్నారు. ప్రేక్షకులంతా మరీ మరీ కోరుతుండడం వల్ల – ఆ కార్యక్రమం మీకిప్పుడు మళ్ళీ ప్రత్యేకంగా చూపిస్తున్నాం....”

ఇలా అర్థం వచ్చే ప్రకటన ఒకటి హిందీలోనూ, ఇంగ్లీషులోనూ చేసి అనౌన్సర్ మళ్ళీ నవ్వింది. నాకానవ్వు అందంగా అనిపించలేదు.

కార్యక్రమం ప్రారంభమైంది.

నాకుమాత్రం టీవీలో రాజీవ్‌గాంధీకి బదులు సత్యానందం కొడుకు కనిపిస్తున్నాడు.

జోకర్ సత్యానందం ముద్దుబిడ్డ! మన రాజీవ్‌గాంధీ భరతమాత ముద్దుబిడ్డ. ఆమెకు తన బిడ్డ ప్రతాపం మరీ మరీ చూసుకోవాలని ఉండదూ!

✦ ✦ ✦